• కుంకంబొట్టు •

శ్రీమతి నవుడూరు వెంకటరమణగారు

చిన్నప్పుడే తల్లీదండ్రీ పోయినప్పటికి వాళమ్మమ్మ రామాన్ని చేరదీసి పెంచి పెద్దవాడిని చేసింది. బి.ఏ. దాకా చదువు చెప్పించి వాళ్లదగ్గరపిల్లనే జానకి నిచ్చి పెండ్లిచేసింది. ఓ యేడాది బాధపడ్డప్పటికి ఏలాగయితేనేం రామం ఒక యాభై రూపాయల వుద్యోగము సంపాదించాడు. ఏదో ఒకలాగు సంసారం గడిచిపోతోంది.

జానకి చాల తెలివైనపిల్ల. కాస్త చదువుకున్నది; బుద్ధిమంతురాలు. మొగుడుదగ్గర అవ్వదగ్గర వినయ విధేయతతో ప్రవర్తించేది. అసలు ముద్దుగా పెరిగింది. చిన్నప్పటినించి రామాన్ని తెలుసును. అప్పుడప్పుడు చిన్నప్పుడు రామం వేసంగికి వాళ్లవూరువస్తే అతనితో షికార్లకి సినీమాలకి వెళుతూవుండేది. ఇంటిదగ్గర గవ్వలాట, పేకాట, కారమ్సు ఆడేది. అందుచేత పెండ్లి అయాకకూడ రామందగ్గర అతి చనువుగా ముద్దుగా వుండేది. చిలకాగోరింకల్లాగ చక్కగా కాపురం చేస్తున్నారు. రామం శిక్షణవల్ల నయితేనేం, అనుభవంమీద నైతేనేం జానకి మొగుడుకి యేమాత్రం చికాకు గల్గించకుండా ఎప్పుడూ వుల్లాసం కలిగిస్తూ వుండేది. ఏ పనిచేసినా ఏ మాట అన్నా అది ఇవతల వాళ్లకి, అందులో ముఖ్యంగా తన మొగుడికి కష్టం గాను, అయిష్టంగాను లేకుండా చూసుకుని ప్రవర్తించేది. అవ్వగారి శిక్షణవల్ల శుచి, శుభ్రత, మడి, ఆచారము, దైవభక్తి యివన్నీ అలవడ్డాయి. అంటే పరమపతివ్రతల కుండవలసిన సుగుణాలన్నీ జానకి పదహారేళ్లు నిండేసరికి నేర్చేసుకుంది.

జానకి కాపరానికివచ్చి ఒకయేడాదిమాత్రమే అయినప్పటికి అవ్వగారు మాత్రం జానకి కింకా నెల తప్పలేదని విచారిస్తోంది. అప్పుడే చాలరోజుల్నించి 'రామం! నీ కడుపు నో కాయ కాస్తే చూతామనుందిరా. అప్పటికిగాని నా ప్రాణం పోదురా' అని పూరుతోంది. రామంచేత జానకిచేత తిరపతి వస్తామని మొక్కించింది. ఆడపిల్లయినా మగపిల్లయినా పేరెట్టిస్తానంది. జానకిచేత యెన్నోనోములు వ్రతాలు చేయించింది. ఆఖరుకి ఎలాగయితేనేం దేవుణ్ణి మెప్పించింది. జానకికి యీ సారి నెల తప్పింది. ఇంక ముసలావిడ సంతోషానికి పట్టపగ్గాలు లేవు. యిదివరకే ఏ పనీ చేయనిచ్చేది కాదు. ఇప్పుడు మరీ గారాబంగా చూస్తోంది. రామానికి జానకంటే అమితమైన ప్రేమ. విధిలేక ఆ నాలుగంటలు ఎలాగో ఆఫీసులో గడపి నిత్యం జానకిదగ్గర కూర్చునేవాడు. అనేక మాసపత్రికలు తెచ్చి ఆమెచేత చదివిస్తూ తానూ వింటూవుండేవాడు. ఆమెకి చదరంగం, కారమ్సు, పేకాట నేర్పి, తనూ ఆమె ఆడుకుంటూ కాలం గడిపేసేవారు హాయిగా. ఇంటికొచ్చి 'జానకీ!' అని పిలుస్తే వెంటనే ఆమె రావాలి అంతే! లేకపోతే వెర్రెత్తిపోయి జోడైనా విప్పకుండా ఇల్లంతా వెతికేసేవాడు.

ఇంతలో జానకికి ఏడో నెలవచ్చింది. వాళ్లవాళ్లు తీసుకుని వెళ్లిపోయారు. ఒకరినొకరు వదల్లేక జానకి రామంలు ఎక్కువ శ్రమపడ్డారు. కాని వారానికో వుత్తరం రాయటానికి వప్పుకొని విడిపోయారు విధిలేక. ఇలా కాలం జరిగిపోతూంది. క్రమంగా జానకికి నెలలు నిండాయి. మంచినక్షత్రాన్ని కొడుకుని కన్నది. శుభప్రదంగా బాలసారె మహోత్సవం జరిగింది. సెలవు లేనందున వెంటనే తిరిగివెళ్లి పోవచ్చాడు. జానకిని మూడో నెల్లో పంపిస్తామన్నారు వాళ్లవాళ్లు. వారానికో వుత్తరంమాత్రం తప్పకుండా నడచిపోతూంది క్రమము తప్పకుండా.

మూడోనెల ప్రవేశించాక మంచిరోజు చూసి ఆనాటికి స్టేషనుకి రమ్మని వ్రాశారు రామానికి. ఆవిధంగానే రామం సరిగా రైలువేళకి వెళ్లి జాగ్రత్తగా జానకిని పిల్లడిని యింటికి తీసుకువచ్చాడు. వెంటనే బజారుకిపోయి కావలసిన సామగ్రి పట్టుకొచ్చాడు. ఆ వేళకి సెలవుపెట్టి ఇంటిదగ్గర కులాసాగా జానకితో కబుర్లు చెప్పుకుంటూ కాలము గడిపేశాడు హాయిగా.

అదృష్టవశాత్తు రామానికి చిన్నప్పటినించి పుట్టి పెరిగిన వూళ్లోనే వుద్యోగం దొరకటంచేత అతనికి అనేకమంది స్నేహితులుండేవారు. అందుచేత రామానికి యిన్నాళ్లు జానకిదగ్గర లేకపోయినా, ఎలాగో ఒకలాగు కులాసాగానే గడిపేయుగలిగాడు. అతని స్నేహితులందరిలోనూ ముఖ్యుడు శాస్త్రి. రామం శాస్త్రి ఒకరినొకరు విడిచేవారుకారు. ఎవళ్లోఒకళ్లు రెండోవాళ్ల యింటికి వెళ్లడం, తరవాత వాళ్లిద్దరూ కలిసి సాయంత్రం బీచికి వెళ్లటం, మిగతా స్నేహితులతో కలిసి ఏ పేకాటో, బాతాఖానీయో వేయటం, రాత్రి ఏకున్నరకి యింటికి చేరటం మామూలు. శాస్త్రి రామానికి కాస్తంత దూరపుబంధువుకూడాఅవటంనించి తర్చు రామంయింటికి వచ్చేటప్పుడు అరమరలేకుండ జానకితోటి అవ్వగారితోటికూడా బాతాఖానీ వేసేవాడు. అసలు శాస్త్రి మంచిమాటకారి. అతి చలోక్తిగా మాట్లాడి అందరిని నవ్విస్తూండడం అతని కలవాటు. తనవాళ్లుగాని, యితరులుగాని యెంత విచారంగా వున్నప్పటికి తనమాటలచేత ఖులాసా పుచ్చేవాడు. తనని ఒకరో మాటన్నప్పటికి, దానికేదో హాస్యార్థము తీసి నవ్వేసేవాడు. తను నొచ్చుకోడు. ఇతరులను నొచ్చుకోనివ్వడు. రామం, అమ్మమ్మ 'ఏమిరా శాస్త్రి నీకు పెళ్ళొద్దుటరా' అంటే 'పెళ్లి లేకపోతే బతకలేమటండీ' అనేవాడు.

రోజు అలవాటుప్రకారం జానకి వచ్చినరోజున కూడ రామం తెల్లపంచ, తెల్లనిచొక్కా, బూటు వేసుకొని షైరు పోవడానికి వీధిగుమ్మంలోకి వచ్చి నిల్చున్నాడు. కాని ఏదో మరిచిపోయినట్టుండి ఓసారి లోపలికివెళ్లి మళ్లీవచ్చేశాడు. వెనకాలే జానకి వస్తూ 'రోజూ లాగ కాక యివ్వాళ పెందరాడే రాండేం' అంది బుగ్గతుడుచుకుంటూ. 'సరేలే తలపేసుకో' అని వెళ్లిపోయాడు రామం శాస్త్రి యింటికి. శాస్త్రి అప్పుడే టాయిలెట్టయి సిద్ధంగా నిల్చున్నాడు. అప్పుడు ఇద్దరుకలిసి 'పాలఘాట్'లో కాఫీతీసుకుని బయలుదేరారు బీచికి.

శాస్త్రి, రామం, శర్మ, రావు యిత్యాదులంతా సమావేశమయారు సముద్రపొడ్డున. బాతాఖానీ చాలా ఘాటుగా సాగిపోతూంది ఆ వూళ్లో అన్ని విషయాలగురించి. ఆ వూరు మునసబుగారిని ఓ ప్లీడరుగారు ఎదిరించి మాట్లాడటం, తరవాత వాళ్లిద్దరి చర్చ హైకోర్టువరకు వెళ్లటం మొదలు వాళ్ల మునిసిపాలిటీ హెల్తు యినస్పెక్టరు చచ్చడి రామిని మోహించటం వరకు గల యావత్తువిషయాలు దొర్లిపోతూన్నాయి వాళ బాతాఖానీలో. డాక్టరు సుబ్బరాయనుసతిబిల్లు, ఋణవిరామచట్టము, ఆంధ్రరాష్ట్రముగురించి మొదలైన రాజకీయవిషయాలు, హిట్లరు ముసోలినీ వాళ్ల వాళ్ల ప్లానులు, ఒకటేమిటి అన్నిటిని చర్చించి పాకేస్తున్నారు. వార్ధాస్కీము బాగుంటుందంటాడు స్కూలు మాస్టరు రావు. గాంధీగారి శాంతిసమతానికి యిది టైము కాదంటాడు శర్మ. ఈవిధంగా ఎవళ్లకితోచిన విమర్శనవాళ్లు యిష్టమున్న విషయాలమీద సాగిస్తున్నారు.

ఇంతసేపు చాలా పరధ్యాన్నంగా వున్న శాస్త్రి ఒకసారి పరికాయించి రామం కేసి చూపిస్తూ రావుకి సైటు కొట్టాడు. రావుకూడ చాలా తదేకదీక్షగా రామం కేసి చూసి శాస్త్రి తనూ నవ్వుకున్నారు. రామం యీ సంగతి యేమీ కనిపెట్టలేదు. సంభాషణలో కాస్త అవకాశం చిక్కగానే శాస్త్రి రామాన్ని తట్టి:

'రామం ! వదినెప్పుడొచ్చిందిరా' అన్నాడు.

'ఓహో ! అదా సంగతి. అందుకే చాలా పరధ్యాన్నంగా వున్నాడీవేళ' అన్నాడు రావు.

రామం ఆశ్చర్యపోయాడు. ఆవేళ పదకొండు గంటలకొచ్చిన జానకి సంగతి శాస్త్రి కెలా తెలిసిందా అని. తాను స్టేషనుకి వెళ్లినప్పుడుగాని, తిరిగి వాళ్లని బండిలో తీసుకొని వచ్చినప్పుడుగాని, శాస్త్రిగాని, మరే యితర స్నేహితులుగాని చూడలేదు. అసలది వాళ్లెవళ్లు పైని తిరగవలసిన టయిముకాదు. పోనీ శాస్త్రి ఆ వేళ మధ్యాహ్నం వాళ్లింటికి వచ్చాడేమో నంటే, అదీలేదు. తనా విషయంగురించి అతనితో చర్చించలేదు. అంతా అయోమయంగా వుంది. జానకి వచ్చినట్టు ఎలాగు తెలిసింది. శాస్త్రినిగాని జానకినిగాని అనుమానించడమే; అందుకూ అవకాశం చాలటంలేదు. ఇక నక్కడ వుండబుట్టింది కాదతనికి. వెంటనే యింటికి బయలుదేరాడు 'ఒరే! తలనొప్పిగా వుందిరా యింటికి పోతానురా' అని చెప్పి.

'అరే ! అప్పుడే పోతావా, ఇంకా పేకాటవేద్దామని చూస్తున్నా'మన్నారు శర్మ యిత్యాదులు.

'ఇవాళేనా పోనీండ్రా' అన్నాడు రావు.

'సారీ బ్రదర్ ! తలనొప్పిగా వుందిరా' అని చెప్పి బయలుదేరిపోయాడు. ఎలాగో వాళ్లని ఒదుల్చుకొని తిన్నగా యింటిముఖం పట్టాడు.

రామం దారిపొడుగుగా సాయంత్రం జరిగిన ట్రాజెడీనిగురించి ఆలోచించ మొదలుపెట్టాడు. అతని బుర్రలో రైళ్లు పరుగెడుతున్నాయి. ఎంతాలోచించినా, ఏ విధంగాను నిర్ధారణచేయడానికి వీలు కాకుండా వుంది. యీ చిక్కుకు కారణం ఎవరయి వుంటారు? జానకా, శాస్త్రియా? లేక తన తెలివి తక్కువా? తన్నంత ప్రేమిస్తూన్న, తానంతలా ప్రేమిస్తున్న జానకిని అనుమానించవచ్చునా, లేక శాస్త్రి వల్ల తప్పేమయినావుందా? వాడి కెలా తెలిసింది జానకి ఆ వేళ వచ్చినట్టు. తనని ప్రాణసమానంగా ప్రేమిస్తాడే శాస్త్రి. తనకోసం ఏం చేసేయమన్నా చేసేస్తాడే, బావిలో దూకమన్న దూకేటంతటి ప్రాణస్నేహితుడు గదా శాస్త్రి తన్నలా మోసంజేస్తాడా? తిన్నయింటి వాసాలు లెక్కపెట్టేటంతటి మూర్ఖుడు కాడే. తన్నంతలా నమ్ముతున్న శాస్త్రి జానకీ తన్ను మోసంచేస్తే, యింకేమిటి ప్రపంచం? కంచెయే చేను మేసిన కలద దిక్కు——నాసెన్సు ! యేమిటో పిచ్చి వూహలు. జానకి శాస్త్రికూడ అనుమానించవలసిన మనుషులుకారు. ఛీ ! శాస్త్రి వూరికే అలా అని వుంటాడు.......శాస్త్రిగాడు తనని మోసం చేస్తాడా? శాస్త్రి తనని మోసంచేస్తే జానకికూడ దోషియే కదా. జానకిని అనుమానించవలసిందేనా?... యేమో స్త్రీ లెంతకయినా సాహసులు. ఏమీ పాలుపోకుండా వుంది రామానికి.

ఎలాగైతేనేం యిల్లు చేరుకున్నాడు. అతి చికాకుతో జోడైనా విప్పకుండా చతికిలపడ్డాడు కుర్చీలో. వెర్రివాడిలా తల తడుముకుంటూ ఆలోచన చేసేస్తున్నాడు. ఇంతలో వుగ్గుపడుతూంటే కాబోలు చంటిపిల్లడి యేడ్పు వినిపించింది. రామానికి చైతన్యం వచ్చింది. తిరిగి యీ ప్రపంచంలోకి వచ్చాడు. అంతవరకు జరిగినకథంతా శాస్త్రిగాడి వెంకితనం అది జానకికి చెప్పతే అది గాభరాపడుతుంది. ఎంతమాత్రం ఆ విడికి చెప్పకూడదని నిర్ధారణచేసుకుని 'జానకీ !' అని గట్టిగా పిలిచాడు. జానకివచ్చి 'ఏమండి అప్పుడే వచ్చేసేరు' అంటూ జోడు విప్పడానికి కూర్చుంది. అయిపోయాక రామం ముఖంలోకి చూస్తూ 'అలా వున్నారేమండి' అంది. మరికొంచెంసేపు నిదానించి చూసి ఆశ్చర్యంతో నిలబడి యిలా అంది.

'ఏమండి, యిన్నాళ్లు యిదా చేస్తున్నారు. మీకిది బాగుందా నన్నిలా అన్యాయం చేస్తారా? అందుకా నేను పిల్లడి అయిదోనెల్లో వస్తానంటే నీ

'యిష్టం వచ్చినట్టు చెయ్యి' అన్నారు. అడ్డమయిన ముండలికిపోయి సంసారం పాడుజేస్తారా?' అంటూ యేడుపు ప్రారంభించింది.

రామం గుమ్మైపోయాడు. ఇది మరోట్రాజడి ఇదేమిట్రా బాబు ఇలా అంటోంది అనుకున్నాడు. 'అదేమిటి జానకి నేనేం జేశాను. నా వల్ల దోషం ఎంతమాత్రం లేదు. నేను నిన్ను తప్ప మరియే యితర స్త్రీని కన్నెత్తి చూడలేదు. ఎందుకు కలిగిందీ అనుమానం నీకు' అన్నాడు.

జానకి అతని వక్షస్థలంవైపు చూపిస్తూ 'అదేమిటండి, ఆకుంకం మీరూనూ ఎక్కడంటించుకున్నారండి. మీ కిది ధర్మంగా వుందండి. మీరే నన్నిలా అన్యాయం చేస్తే నాకేదండి దిక్కు యింక!' అని రాగం దీసింది. ఆశ్చర్యంతో చూచుకున్నాడు రామం తనగుండెలమీదికి. యెఱ్ఱగా కుంకంబొట్టొకటి తెల్లని చొక్కామీద స్ఫుటంగా అగపడుతోంది.

ఇప్పుడు బోధపడింది రామానికి శాస్త్రిగాడన్న మాటల కర్థం. చిన్ననవ్వు నవ్వి జానకిని దగ్గరకు తీసుకుని ఆమె శిరస్సు గుండెల కదుముకుని ముద్దుపెట్టుకుని 'జానకీ యిప్పుడు చూడు' అన్నాడు. అదే స్థలంలో ఇంకొంచెం కుంకం అంటుకుంది. 'ఇప్పుడు తెలిసిందా' అన్నాడు రామం. 'అదా సంగతి. ఇందాక మీరు షైరుకు జయులుదేరి వీధిలోకెళ్లిపోయి కూడ తిరిగివచ్చి...' అంది సిగ్గుతో.

ఇంతలో ఉగ్గు అదీ పోసి తీసుకొచ్చింది చంటి కుర్రవాణ్ణి అవ్వగారు.

ఉద్బోధము

శ్రీమతి టి. కామాక్షమ్మగారు

శుభములలవడు దురితముల్ సోలిపోవు
చింత నిర్మూలమగు సిరిచెంత జేరు
మనసు కుత్సాహమమితమై, మహినివెలయు
శీల వృత్తములలవడ జేయువిద్య
ఆడుబిడ్డల చదివింపు డన్నలార!

సకల వాంఛితములఁ దీర్ప జాలునట్టి
కలుషముల బాపుమార్గంబుఁ గరపునట్టి
విద్యసాటికి పుడమిలో వేరె గలదె
ఆడుబిడ్డల చదివింపు డన్నలార!

అవనిలో సతులెందరల్లి కబ్బములచే
విఖ్యాతులై భువి వెలయలేదు
పూబోణు లెందరఁద్భుతమొంద బతులకు
పగతుర గెలువ, తోడ్పడగలేదు
సంగీత సాహిత్య సత్కళా కుశలులై
యెందరు బిరుదులు పొందలేదు
మత ధర్మములు దెలిసి పతులకు బోధించి
మగువ లెందరు భువిలోన మనగఁలేదు

పొసగిమామోమున, నేప్రొద్దు బొడచెనేమొ
తొల్లి తల్లుల చదువులు కల్లలేమొ
ఇంటి కల్పక మీరీతి యుండదగునే
ఆడుబిడ్డల చదివింపు డన్నలార!

ఘోషయుంచును మగువల ఘోషబెట్టి
వేష భాషల వనితల వెలినివేసి
యేమిగట్టుకు పోయెదో వెఱ్ఱియన్న
కుళ్లు బోగొట్టుకొనుచు హృద్గోళమందు
ఆడుబిడ్డల చదివింపు డన్నలార!